క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

కపిలేశ్వరపురం: అంగరలో గ్రామంలోని శ్రీ వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు చిలుకూరి కైలాస్‌పతి, పద్మావతి దంపతులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులు చిలుకూరి మాచరయ్య, సత్యవతి దంపతుల జ్ఞాపకార్థం ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. శిబిరంలో వైద్యులైన వారి మనుమలు, కాకినాడకు చెందిన కేపిటల్ హాస్పిటల్స్ వైద్యులు ఆదివారం ఉదయం 10.గంటల నుంచి మధ్యాహ్నం 2.గంటలు వరకూ వైద్య పరీక్షలు నిర్వహిస్తారని పరిసర ప్రాంతాల ప్రజలు ఈ ఉచిత శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

నేడు ఏఎంసీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం మండపేట పట్టణంలో నిర్వహించనున్నట్టు కమిటీ కార్యదర్శి పీవీఎస్ సుబ్బరాజు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కమిటీ చైర్మన్‌గా మండపేట మండలం చిన ద్వారపూడికి చెందిన చింతపల్లి రామకృష్ణ, వైస్ చైర్మన్‌గా కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లి గ్రామానికి చెందిన మోటిపల్లి బాపిరాజు, 18 మంది డైరెక్టర్లుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారన్నారు. పట్టణంలోని సూర్య కన్వెన్షన్ హాల్‌లో ఉదయం 10. గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి కమిటీ పరిధిలోని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరవుతారని కార్యదర్శి సుబ్బరాజు తెలిపారు.

అర్హులందరికీ ఆర్థిక సాయం అందించాలి

కపిలేశ్వరపురం (మండపేట): పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న అర్హులైన విద్యార్థుల తల్లిదండ్రులందరికీ తల్లికి వందనం పథకంతో ఆర్థికసాయమందించాలని మండపేట పట్టణ కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ ఆర్‌టీఐ విభాగం నియోజకవర్గం కన్వీనర్ మందపల్లి రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చేందుకు ఇబ్బడిముబ్బడిగా హామీలిచ్చిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాకా సంక్షేమ పథకాల్లో కోతలు పెడుతున్నారన్నారు. అర్హులైన వారికి సాయం అందించేంత స్థాయిలో నిధులను కేటాయించకపోవడం కూటమి ప్రభుత్వం పాలనతీరులో డొల్లతనం బయటపడిందన్నారు. కూటమి పాలన ప్రారంభమైన నాటినుంచి ఏడాది కాలానికి సైతం ఆర్థిక సాయాన్ని అందించాలని డిమాండ్ చేశారు.

రేపు అంగన్‌వాడీల ధర్నా

కపిలేశ్వరపురం: సీఐటీయూ అనుబంధ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 23న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్టు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృష్ణవేణి శనివారం అంగన్‌వాడీలకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు వర్తింపజేయాలని, విధి నిర్వహణకు ప్రతిబంధకంగా మారిన యాప్‌లను రద్దు చేయాలని, కేంద్రాల్లోని మినీ అంగన్‌వాడీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తించాలన్న డిమాండ్ల సాధనకై రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నా చేయనున్నట్టు కృష్ణవేణి వెల్లడించారు.

ముత్యాలమ్మ జాతర ఘనంగా నిర్వహిస్తాం

రామచంద్రపురం: పట్టణ గ్రామదేవత ముత్యాలమ్మ వారి జాతర తీర్థ మహోత్సవాలను ఈనెల 24, 25 తేదీల్లో రెండు రోజులు పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు ముత్యాలమ్మ ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు తొగరు మూర్తి అన్నారు. ఆలయంలో శనివారం జరిగిన కమిటీ సమావేశంలో మూర్తి మాట్లాడుతూ కోరిన కోరికలు తీర్చే తల్లిగా పేరుగాంచిన ముత్యాలమ్మ వారి జాతర ఘనంగా నిర్వహించాలని తీర్మానించినట్లు తెలిపారు. రామచంద్రపురం పట్టణ, పరిసర ప్రాంత ప్రజలందరూ ముత్యాలమ్మని దర్శించి తల్లి అనుగ్రహం పొందాలని కోరారు. అమ్మవారి తీర్థం పురస్కరించుకుని పాఠశాలల విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా విద్యార్థులు అందరికీ సరస్వతి దేవి పూజలు నిర్వహించి ఉచితంగా పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేస్తామన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మర్రి గణపతి, కార్యదర్శి రెడ్డి కృష్ణ, మద్దెల అశోక్, కొమరిగిరి వెంకట రమణ, గొర్రెల నరసింహ, మర్రి నరసింహ విజయ్, ఉజురు చినబాబు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డులు కలిగి ఉండాలి

కాజులూరు: రాష్ట్రంలో కౌలుకు పొలాలు సాగు చేసే ప్రతిరైతూ సీసీఆర్‌సీ కార్డులు కలిగి ఉండాలని శలపాక వీఆర్వో ఎస్‌వీ గనికమ్మ అన్నారు. శనివారం తణుకువాడలో జరిగిన రైతుల అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ కౌలురైతులు ఈ సీసీఆర్‌సీ కార్డులు పొందడం ద్వారా పంటల నమోదు చేయించుకుని ధాన్యాన్ని సులభతరంగా విక్రయించుకోవటంతో పాటు బ్యాంకుల నుంచి పంటరుణాలు, ప్రభుత్వం నుంచి సబ్సిడీపై వచ్చే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు పొందవచ్చన్నారు. కౌలు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకువచ్చిందని ఈ కార్డు ద్వారా భూ యజమానికి ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు.

అతిసార వ్యాధితో అప్రమత్తం

- గ్రామాల్లో ప్రతికూల వాతావరణం
- సీజనల్ వ్యాధులకు అవకాశం
- 31 వరకూ అతిసార నియంత్రణ పక్షోత్సవాలు



వెదురుమూడి ప్రాథమికోన్నత పాఠశాలలో చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య కార్యకర్తలు

కపిలేశ్వరపురం: అతిసార (నీళ్ల విరేచనలు) లేదా డయేరియాగా పిలుస్తుంటారు. సాధారణంగా లూజు లేదా నీళ్ల విరోచనాలు అవటమే ఈ వ్యాధి లక్షణం. ముఖ్యంగా రెండు రకాలున్నాయి. ఒకటి నీళ్ల విరోచనాలు. దీన్నే 'నార్మల్ డయేరియా' అంటారు. రెండోది రక్తం బంకతో వచ్చే విరోచనాలు. దీన్ని 'డిసెంట్రీ' అంటారు. పిల్లల్లో వచ్చే డయేరియాకు 'రోటా వైరస్', పెద్ద వాళ్లల్లో వచ్చే డయేరియాకు 'నోరో వైరస్'లు కారణం. ఇవే కాకుండా రక రకాల ఫంగల్ ఇన్ఫెక్షన్లు, బ్యాక్టీరియాలు, జీర్ణ వ్యవస్థ దెబ్బతినటం, ఫుడ్ పాయిజనింగ్ లాంటివి డయేరియాకు కారణమవుతాయి. డయేరియా సోకినప్పుడు శరీరంలో నీటి శాతం, లవణాలు తగ్గిపోతాయి. దానివల్ల నీరసంగా తయారవుతారు. ఆ సమయంలో శరీరానికి సరిపడా లవణాలు అందించకపోతే డీహైడ్రేషన్ ఎక్కువై పరిస్థితి ప్రమాదకరంగా మారుతుంది. ఏటా ఈ వ్యాధి కారణంగా ప్రపంచవ్యాప్తంగా 7 లక్షల మంది చనిపోతున్నారని వైద్య వర్గాలు పేర్కొంటున్నాయి.

అతిసార వ్యాధి లక్షణాలు

అతిసార వ్యాధి విబ్రియో కామా, కలరా అనే బ్యాక్టీరియా ద్వారా వ్యాపిస్తుంది. కలుషితమైన ఆహార పదార్థాలు, నీరు తీసుకోవడం, శరీరంలో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండటం, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం, తల్లిపాలు లోపించడం ద్వారా పిల్లలకు అతిసార సోకుతుంది. పిల్లలు అతిసారంతో బాధపడుతుంటే, వారికి ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్(ఓఆర్ఎస్) ఇవ్వడం, వైద్యుడిని సంప్రదించడం చాలా అవసరం.

సరైన ఆహారం తప్పనిసరి

తేలికగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి, మసాలాలు, నూనెలు ఎక్కువగా ఉన్న ఆహారానికి తప్పనిసరిగా దూరంగా ఉండాలి. కొబ్బరినీళ్ల లాంటివి తీసుకోవాలి. ఎలక్ట్రాల్ పొడి కలిపిన నీళ్లు, కొబ్బరినీళ్లు, నిమ్మరసం వంటివి తాగితే శరీరం కోల్పోయిన లవణాలను తిరిగి పొందుతుంది. వ్యాధి తగ్గిన తరువాత రెండు వారాలు పోషికాహారం తప్పనిసరి

పక్షం రోజులు కార్యక్రమాలు

అతిసార నియంత్రణ పక్షోత్సవాలను ఈనెల 16 నుంచి నెలాఖరు వరకూ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. అందుకు తగిన కార్యాచరణ ప్రణాళికను సైతం నిర్దేశించగా వైద్య, ఆరోగ్య సిబ్బంది ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఓఆర్ఎస్, జింక్ డోస్‌లను సులభంగా అందుబాటులోకి తెచ్చి డీహైడ్రేషన్‌కు గురికాకుండా చూడాలని ఆదేశాలు మేరకు వాటిని సిద్ధం చేశారు. ఒకవేళ డీహైడ్రేషన్‌కు గురైతే ఆరోగ్యానికి హాని కలగకుండా కాపాడటంపై ప్రతి ఒక్కరిలో అవగాహన కల్పిస్తున్నారు. గ్రామాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకులను, ఇతర తాగునీటి వనరులను శుభ్రం చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

తల్లిపాలు శ్రేష్టం



అతిసారకు చిన్నారులు అధికంగా గురవుతుంటారు. మొదటి ఆరు నెలలు వారికి కేవలం తల్లి పాలు మాత్రమే పట్టాలి. విరోచనాలు అవుతున్నప్పుడు తల్లిపాలు, ఇతర ద్రావణాలను, అనుబంధ ఆహారాన్ని నిర్విరామంగా ఇవ్వాలి. బిడ్డకు ఆహారం తినిపించే ముందు, వంట చేయడానికి ముందు, బిడ్డ మలమూత్ర విసర్జకాలను తీసినప్పుడు చేతులను సబ్బుతో శుభ్రపర్చుకోవాలి. విరేచనాలు సమయంలో బిడ్డకు ఆరోగ్య సిబ్బంది సూచనలు మేరకు ఓఆర్ఎస్ ద్రావణంతో పాటు నిర్దేశించిన మోతాదులో జింక్ మాత్రలు 14 రోజులపాటు ఇవ్వాలి. నీరు, మజ్జిగ, కొబ్బరినీళ్ళు తదితర ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. రోజు మొత్తంలో 15 గ్లాసులు సురక్షిత నీరు త్రాగాలి. ఎండ, వానలకు ప్రభావితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ కొల్లాబత్తుల విజయదీపిక, అచ్యుతాపురం పీహెచ్‌సీ.

ఎస్‌ఏబీఎస్‌ఆర్ ట్రస్టు సేవలు అభినందనీయం



రోగులకు ఉచితంగా హోమియో మందులు అందిస్తున్న నిర్వాహకులు

కపిలేశ్వరపురం: (మండపేట) మండలంలోని అర్తమూరు గ్రామానికి చెందిన ఎస్‌బీఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్టు సేవలు ప్రశంసనీయమని గ్రామానికి చెందిన పలువురు ప్రముఖులు కొనియాడారు. ట్రస్టు చైర్మన్ సత్తి బులిస్వామి రెడ్డి ఆధ్వర్యంలో శనివారం గ్రామంలో 184వ ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వాహించారు. రాజమండ్రిలోని డా.అల్లూరి రామలింగయ్య ప్రభుత్వ హోమియో వైద్యశాల వైద్యులు సుమమాధురి, మమత, సుశీల, అనూష, పద్మావతి, మార్కండేయులు ఈ శిబిరంలో వైద్య సేవలందించారు. వివిధ ఆరోగ్య రుగ్మతలకు ఉచితంగా హోమియో మందులను అందజేశారు. ముఖ్య అతిథిగా యోగా గురువులు మేడపాటి వెంకటరెడ్డి, మేడపాటి సుబ్బిరెడ్డి హాజరై ట్రస్టు ద్వారా బులిస్వామిరెడ్డి చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ట్రస్టు వైస్ చైర్మన్ సత్తి లక్ష్మణరెడ్డి, డైరెక్టర్ సత్తి సత్యనారాయణరెడ్డి, కన్వీనర్ తాడి కోదండ రామారెడ్డి, తాడి సుబ్బిరెడ్డి, తాడి శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచే గణిత ఒలింపియాడ్ శిక్షణ తరగతులు



డాక్టర్ కేవీవీ సత్యనారాయణ, రామచంద్రపురం

రామచంద్రపురం రూరల్: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా గణిత ఒలింపియాడ్ ఉచిత శిక్షణ తరగతులు నేటి ఉదయం 9 గంటల నుంచి ప్రారంభించనున్నట్లు రామానుజన్ గణిత అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కేవీవీ సత్యనారాయణ శనివారం విలేకరులకు తెలిపారు. ఈ క్లాసులకు హాజరు కావడం వలన విద్యార్థులకు గణితంపై ఆసక్తి పెరుగుతుందన్నారు. గణిత శాస్త్ర అధ్యయనంపై పరిశోధన శక్తి మెరుగుపడుతుందన్నారు. గణిత శాస్త్రాన్ని అభివృద్ధి చేసిన శాస్త్రవేత్తల జీవిత విశేషాలు, శాస్త్ర అభివృద్ధికి వారి కృషి తెలుస్తాయన్నారు. ముందుగా మొదటి రోజు ముఖ్యంగా విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. దీని కోసం విద్యార్థులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరు తప్పని సరిగా హాజరు కావాలని కోరారు. విద్యార్థుల కోసం గణిత ఒలింపియాడ్‌కు అవసరమైన మెటీరియల్, రిఫరెన్స్ పుస్తకాలు రామానుజన్ గణిత అకాడమీలోని గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ ఉచిత గణిత ఒలింపియాడ్ శిక్షణ తరగతులు జరుగుతాయని వివరించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్టీసీ బస్సుల కోసం జనం పడిగాపులు

- రెండు రోజుల్లో డిపోకు రూ.10 లక్షల నష్టం



బస్సులు రాక వెలవెలబోతున్న ఆర్టీసీ బస్టాండ్

రామచంద్రపురం: అంతర్జాతీయ యోగా డే పురస్కరించుకుని విశాఖలో జరిగే ప్రధాని మోదీ కార్యక్రమానికి రామచంద్రపురం డిపో నుంచి ఆర్టీసీ బస్సులను తరలించడంతో ప్రయాణికులు రెండు రోజులు పాటు నానా అవస్థలు పడ్డారు. రామచంద్రపురం ఆర్టీసీ డిపో నుంచి భారీగా ఆర్టీసీ బస్సులను విశాఖ జిల్లాకు తరలించి అక్కడి నుంచి ప్రజలను యోగా జరిగే ప్రాంతానికి తరలించారు. దీంతో డిపో పరిధిలో సుమారుగా 48 సర్వీసులను నిలిపివేశారు. డిపో నుంచి ప్రతి రోజూ 52 సర్వీసుల వరకు నడుపుతారు. కానీ విశాఖ యోగా దినోత్సవానికి బస్సులను తరలించటంతో డిపో పరిధిలోని 48 సర్వీసులను నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. డిపో నుంచి రాజమహేంద్రవరం, యానాం, కాకినాడ–కోటిపల్లి, సామర్లకోట ప్రతి 20 నిమిషాలకు ఒక బస్సు నడుపుతుంటారు. దీంతో పాటుగా బ్రహ్మపురి, సుందరపల్లి, వాకతిప్ప, కపిలేశ్వరపురం వంటి పల్లెలకు వెళ్లే సర్వీసులను పూర్తిగా రెండు రోజులుగా నిలిచిపోయాయి. రాజమహేంద్రవరానికి 18 సర్వీసులను రోజూ నడుపుతుంటే గత రెండు రోజులుగా కేవలం 6 సర్వీసులను మాత్రమే నడిపారు. యానం ప్రతి రోజూ 6 నుంచి 8 సర్వీసుల వరకు తిప్పుతుంటారు. కానీ కేవలం 2 సర్వీసులు మాత్రమే తిరిగాయి. రామచంద్రపురం డిపో నుంచి పెద్ద ఎత్తున బస్సులను తరలించటంతో రెండు రోజుల్లో దాదాపుగా రూ.10 లక్షల వరకు ఆదాయాన్ని కోల్పోయినట్లు తెలుస్తుంది. శనివారం కావటంతో వాడపల్లికి భక్తులు వెళుతుంటారు. కానీ వాడపల్లి సర్వీసులను కూడా లేకపోవటంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కేవలం శనివారం ఒక్కరోజులోనే వాడపల్లి సర్వీసుల ద్వారా డిపోకు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఆదాయం సమకూరుతుంది. ఈ శనివారం వాడపల్లికి సర్వీసులను తిప్పకపోవడంతో డిపో ఈ ఆదాయాన్ని కోల్పోయింది. గత రెండు రోజులుగా డిపో నుంచి 48 బస్సులు తరలి వెళ్లిపోవటంతో డిపో బోసిపోయింది. నిత్యం బస్సులు ప్రయాణికులతో రద్దీగా ఉండే రామచంద్రపురం డిపో బస్సులు లేక వెలవెలబోయింది. సుదూర ప్రాంతాలకు వెళ్లవలసిన ప్రయాణికులు డిపోలో గంటల తరబడి బస్సుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

ఉచితంగా నోట్ పుస్తకాల పంపిణీ



నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న దాత డీఆర్‌సీ రెడ్డి

రాయవరం: మండలంలోని పసలపూడి మోడల్ ప్రైమరీ పాఠశాలలో శనివారం విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన దాత, రెడ్డి సంక్షేమ సంగం సంయుక్త కార్యదర్శి డీఆర్‌సీ రెడ్డి సౌజన్యంతో పసలపూడి మెయిన్ ప్రాథమిక పాఠశాలతో పాటుగా, న్యూకాలనీ, నంబర్1 ప్రాథమిక పాఠశాల, యర్రమట్టిపురం, సర్వారాయతోట, నరాలవారిపాలెం ప్రాథమిక పాఠశాలలకు చెందిన 150 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, స్కేల్, పెన్ను, పెన్సిల్ తదితర సామగ్రిని అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం కోరుమిల్లి వెంకటరమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేశారు. హెచ్‌ఎం వెంకటరమణ, ఉపాధ్యాయులు పి.విజయకుమార్, కలిశెట్టి శ్రీనివాస్, శీరపు వెంకటరమణ, సుబ్బారావు తదితరులు దాత డీఆర్‌సీ రెడ్డి సేవలను ప్రశంసించారు.

వేంకటేశ్వరుని ఆలయానికి పోటెత్తిన భక్తులు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. స్వామివారి దర్శనం కోసం తెల్లవారుజాము నుంచి భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరారు. వేంకటేశ్వరస్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో 'మిత్రమండలి మూవీ' టీమ్



విఘ్నేశ్వరుని సన్నిధిలో మిత్ర మండలి మూవీ టీమ్

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామిని 'మిత్రమండలి మూవీ టీమ్' శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకుడు మాచరి వినాయకరావు వేదాశీర్వచనం అందజేసి శేష వస్త్రాలు అందజేశారు. స్వామివారి చరిత్రను వీరికి వివరించారు. ఆలయ ఈవో అల్లు వెంకట దుర్గాభవాని వీరికి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.


ఉచిత హోమియో వైద్య శిబిరం

కపిలేశ్వరపురం: మండలలోని అంగర గ్రామంలో శ్రీ వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ నిమ్మల రామారావు, నేమాని శ్రీనివాస్ పర్యవేక్షణలో శ్రీవిశ్వ మానవతా హోమియో వైద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించారు. పరిసర ప్రాంతాల రోగులు ఈ శిబిరంలో పాల్గొని కీళ్లనొప్పులు డయాబెటిస్, స్త్రీల సమస్యలపై వైద్య పరీక్షలు చేసి రోగులకు హోమియో మందులను అందజేశామన్నారు.

సంపద తయారీ కేంద్రాల ప్రారంభం

అయినవిల్లి: గృహ వ్యర్థాల నుంచి సంపదను సృష్టించి సంపూర్ణ పారిశుధ్యాన్ని సాధించడమే లక్ష్యంగా తద్వారా గ్రామ పంచాయతీలకు ఆదాయ మార్గంగా తీర్చిదిద్దడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. శనివారం వెలువలపల్లిలో ఉపాధి హామీ పథకం ద్వారా సుమారు రూ.22 లక్షలతో నిర్మించిన భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే మండలంలోని మాగం, పొట్టిలంక గ్రామాల్లో నిర్మించిన చెత్తతో సంపద తయారీ కేంద్రాల నూతన భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకట సరోవరరావు, సర్పంచ్ బొంతు మణి, నాయకులు బడుగు జోగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఐ, వీఆర్వోలకు సత్కారం



అవార్డు గ్రహీతలను సత్కరించిన తహసీల్దార్ మృత్యుంజయరావు తదితరులు

రామచంద్రపురం రూరల్: రెవెన్యూ డే సందర్భంగా జిల్లా స్థాయి ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్న రామచంద్రపురం ఆర్ఐ వాసంశెట్టి సత్యదేవప్రసాద్, పట్టణ వీఆర్వో మద్దాల బాపూజీలను రామచంద్రపురం తహసీల్దార్ బండి మృత్యుంజయరావు ఆధ్వర్యంలో శనివారం సత్కరించారు. అవార్డులు పొందిన స్ఫూర్తితో ప్రజలకు మరింత అంకిత భావంతో సేవలు అందించాలని తహసీల్దార్ సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వరసాల మాధురి, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ కె. హరి, మండల సర్వేయర్ పి.నాగేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ పి.రామారావు, వీఆర్వోల సంఘం మండల అధ్యక్షుడు ఎస్.సత్తిబాబు, ఉపాధ్యక్షురాలు సత్యవతి, కోశాధికారి కె.పరంజ్యోతి, నాయకులు పంపన విష్ణుమూర్తి, చీకట్ల వీరాంజనేయులు, అధిక సంఖ్యలో వీఆర్వోలు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



వేంకటేశ్వరుని కల్యాణానికి తరలివచ్చిన భక్తులు

ఆలమూరు: మండలంలోని గుమ్మిలేరులో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక కల్యాణోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయంలోని దేవతామూర్తుల విగ్రహాలను పల్లకీలో ఉంచి భక్తుల జనసందోహం మధ్య నిర్వాహకులు గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని వేదికపై ఆలయ ప్రధాన అర్చకుడు విజయ్‌కుమార్ నేతృత్వంలోని వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని గ్రామానికి చెందిన సందీప్, అపూర్వ దంపతులు శాస్త్రోక్తంగా జరిపించారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామి వారి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన జరిగింది.

ఘనంగా ప్రపంచ యోగా దినోత్సవం



హసన్‌బాదలో యోగా ఆకృతిలో విద్యార్థులు



మండపేటలో యోగాభ్యాసం చేస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి, తదితరులు

కె.గంగవరం/కాజులూరు/రామచంద్రపురం/ రామచంద్రపురం రూరల్: కె.గంగవరం మండంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, గ్రామ పెద్దలు శనివారం ప్రపంచ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులతో పలురకాల యోగా ఆసనాలు వేయించారు. కుందూరు ఉన్నత పాఠశాలలో జరిగిన ప్రపంచ యోగా దినోత్సవంలో ఎంపీపీ పంపన నాగమణి పాల్గొని యోగాసనాలు వేశారు. ప్రతి విద్యార్థి రోజూ యోగా ఆసనాలు వేయడం క్రమం తప్పకుండా చేయాలని ఆయన సూచించారు. యోగాసనాల సాధన ద్వారా మనిషి మెరుగైన ఆరోగ్యాన్ని, మానసిక ప్రశాంతతను పొందగలుగుతాడని బీజేపీ రామచంద్రాపురం నియోజకవర్గ కన్వీనర్ దూడల శంకరనారాయణ అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా కాజులూరు మండలంలోని పలు గ్రామాల్లో శనివారం అధికారులు, నాయకులు, విద్యార్థులు యోగాసనాలు, సూర్యనమస్కారాల కార్యక్రమం నిర్వహించారు. రామచంద్రపురం మండలంలోని హసన్‌బాదలో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో 6 చోట్ల సచివాలయ సిబ్బంది ద్వారా ప్రజలకు యోగా శిబిరాలు నిర్వహించారు. జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు యోగా అక్షరాల ఆకృతిలో ఉండి యోగాభ్యాసాలు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రామచంద్రపురం జెడ్పీ బాలికల హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయిని కె.కుసుమ లక్ష్మీ కుమారి ఆధ్వర్యంలో యోగా కార్యక్రమాలు ఉత్సాహంగా నిర్వహించారు. స్థానిక ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ ఎస్ఎస్‌జీ కిశోర్ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులు రేపటి భవిష్యత్తుకు పునాది అని అందరూ ఆరోగ్యంగా ఉండేందుకు యోగాను నిత్యం అనుసరించాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు సంస్థ తరపున నోటు పుస్తకాలు పంపిణీ చేశారు.

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట నియోజకవర్గంలోని గ్రామాల ప్రజలు యోగాభ్యాసనాలతో సందడి చేశారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మండపేట పట్టణం, మండపేట రూరల్ మండలంలోని 12, రాయవరం మండలంలోని 12, కపిలేశ్వరపురం మండలంలోని 19 గ్రామాల్లో ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది, ప్రజా సంఘాలు, యోగాభ్యాసన కేంద్రాలు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు.

రోజువారీ జీవితంలో భాగం కావాలి

పట్టణంలోని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి అధ్యక్షతన పట్టణంలోని సూర్య ఫంక్షన్ హాల్‌లో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పట్టణ వాసులకు యోగాభ్యాసనం చేయించిన యోగా గురువులు కురసా సత్యనారాయణ, అంకం భాస్కరరావు, మణికుమార్‌లను మున్సిపల్ అధికారులు ప్రజాప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ చుండ్రు శ్రీవరప్రకాష్, రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గడి సత్యవతి, కౌన్సిలర్లు కాశిన కాశీ విశ్వనాథం, గ్రంధి శ్రీనివాస్, మున్సిపల్, మెప్మా సిబ్బంది, వార్డు సచివాలయ సిబ్బంది, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

ఆలయానికి పోటెత్తిన భక్తులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. శనివారం ఏకాదశి తిథి కలసి రావడంతో భక్తుల రద్దీ మరింత పెరిగింది. భారీ క్యూలైన్‌లో వెళ్లి భక్తులు స్వామిని దర్శించుకున్నారు. అలాగే ఆలయంలో నిత్యం నిర్వహిస్తున్న నారసింహ సుదర్శన హోమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నిత్యాన్నదాన పథకంలో సుమారు మూడు వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. అన్నదాన పథకంలో భక్తులకు భోజన సౌకర్యాలను, వడ్డిస్తున్న పదార్థాల గురించి ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్‌వీ ప్రసాద్ స్వయంగా పర్యవేక్షించారు.

లక్ష్మీనృసింహుని ఆదాయం రూ.3,27,363

అంతర్వేది లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఒక్కరోజు భక్తుల నుంచి వివిధ రూపాల్లో మొత్తం ఆదాయం రూ.3,27,363 సమకూరినట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్‌వీ ప్రసాద్ తెలిపారు. ఇందులో స్వామివారి ప్రసాద విక్రయాలు, ప్రత్యేక దర్శనం టికెట్ల అమ్మకాలు, ఇతర సేవా టికెట్ల ద్వారా రూ.1,21,179, నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళాల ద్వారా రూ.2,06,184 ఆదాయం వచ్చినట్టు ఆయన పేర్కొన్నారు.

శనైశ్చరునికి తైలాభిషేకాలు



మందపల్లిలో శనైశ్చరస్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామిని శనివారం అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించారు. దేవాదాయ–ధర్మదాయ డీసీ, ఈవో నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో స్వామివారి పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ముందుగా ప్రాతఃకాల సమయంలో ఆలయ ప్రధాన అర్చకుడు అయిలూరి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో అర్చకులు, వేదపండితులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. భక్తులు ప్రత్యక్షంగా, పరోక్షంగా తైలాభిషేకాలు, పూజలు ద్వారా దేవస్థానానికి రూ.1,90,975, అన్నప్రసాదం విరాళాల రూపంలో రూ.51,625తో కలిపి మొత్తం రూ.2,42,600 ఆదాయం వచ్చినట్టు డీసీ అండ్ ఈఓ తెలిపారు.